
సాక్షి
అనంతపురం
సోమవారం । 23 । జనవరి । 2023



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

బుక్కరాయసముద్రంలో ఈ నెల 29 నుంచి కొండమీద రాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.
8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం 31.6°/13.5°

జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.



పెనుకొండలోని గగన్ మహల్

అనంత ఆణిముత్యాలు

- విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా
- సముచితరీతిలో సత్కరించనున్న గగన్‌మహల్ ట్రస్టు
- ఈ నెల 28న పెనుకొండలో 'అనంత ఆణిముత్యాలు' పురస్కారాల ప్రదానోత్సవం

(తోలేటి మహేశ్వరరెడ్డి)
సాక్షి, అనంతపురం డెస్క్:

ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఘన చరిత్ర ఉంది. సారవంతమైన నేలలు, సహజ వనరులకు నిలయం. రాయలేలిన ఈ నేలలో ఒకప్పుడు రతనాలు రాశులుగా పోసి అమ్మారు. కల్లూరు సుబ్బారావు మొదలుకుని పెద్ద వడుగూరు చిన్నపరెడ్డి దాకా ఎందరో త్యాగధనులు స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించారు. తరిమెల నాగిరెడ్డి, నీలం సంజీవరెడ్డి వంటి వారు రాజకీయంగా సత్తా చాటారు. సత్యసాయి, గణపతి సచ్చిదానంద, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ లాంటి మహనీయులు ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందించారు. యోగివేమన, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యులు, విద్వాన్ విశ్వం తదితర కవులు సాహితీ రంగాన్ని సుసంపన్నం చేశారు. బళ్లారి రాఘవ, కేవీరెడ్డి, దళవాయి చలపతి వంటి వారు 'కళా' నైపుణ్యాన్ని దశదిశలా చాటారు. నేటికీ ఎంతోమంది 'అనంత'వాసులు వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి సముచిత రీతిలో సత్కరించే కార్యాన్ని పెనుకొండలోని సాహితీ గగన్‌మహల్ ట్రస్టు కొన్నేళ్లుగా కొనసాగిస్తోంది. ఇప్పటికే ఏడు విడతల్లో అనేక మంది ప్రముఖులను సత్కరించింది. 8వ అనంత ఆణిముత్యాల పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 28న శనివారం సాయంత్రం ఐదు గంటలకు పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అత్యంత వైభవంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా విభిన్న రంగాల్లో లబ్ధప్రతిష్టులైన 23 మంది అనంత వాసులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. పురస్కార గ్రహీతల వివరాలివీ..

ఏకే ఖాన్



పెనుకొండకు చెందిన అబ్దుల్ ఖయ్యూంఖాన్ (ఏకే ఖాన్) రిటైర్డు ఐపీఎస్ అధికారి. ఉమ్మడి రాష్ట్రంలో పోలీసు శాఖలో పలు హోదాల్లో పనిచేశారు. 2017 నుంచి తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా సేవలందిస్తున్నారు. ఐపీఎస్ అధికారిగా నిబద్ధతతో పనిచేసి ఇండియన్ పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. ఫుట్‌బాల్, హాకీ తదితర క్రీడల అభివృద్ధికి, సివిల్ సర్వీస్ అభ్యర్థుల శిక్షణకు సహకారం అందిస్తున్నారు.

ఎం.బద్రి నారాయణమూర్తి



ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త. ప్రస్తుతం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన మహేంద్రగిరి(తమిళనాడు)లోని ఐపీఆర్‌సీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అంతరిక్ష నౌకలు నడపడానికి అవసరమైన ద్రవ ఇంధనాన్ని ఈ సంస్థ తయారు చేస్తుంది. తాడిమర్రికి చెందిన బద్రి నారాయణమూర్తి ఇస్రో పరిశోధనల్లో కీలకంగా ఉన్నారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఈయన పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఇస్రో ఎక్స్‌లెన్స్ అవార్డు కూడా అందుకున్నారు.

వైవీకే మోహన్



అనంతపురానికి చెందిన లెఫ్టినెంట్ జనరల్ వైవీకే మోహన్ సుమారు నాలుగు దశాబ్దాల పాటు రక్షణ శాఖలో వివిధ హోదాల్లో సేవలందించారు. చిట్టచివరగా వెల్లింగ్‌టన్ రక్షణ సేవల స్టాఫ్ కళాశాల కమాండెంట్‌గా 2020 డిసెంబర్‌లో రిటైర్ అయ్యారు. సుదీర్ఘకాలం సేవలందించినందుకు గాను ఇటీవల 'పరమ విశిష్ట సేవా పతకం' అందుకున్నారు. ప్రస్తుతం సికింద్రాబాదులోని ఇంటర్నేషనల్ స్కూల్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ సీఈఓగా వ్యవహరిస్తున్నారు.

ఖండే చిన్న అంజినమ్మ



ధర్మవరంలోని కేశవాపురం నివాసి ఖండే చిన్న అంజినమ్మ తోలుబొమ్మలాట కళాకారిణిగా గుర్తింపు పొందారు. వివిధ సామాజిక అంశాలపై తోలుబొమ్మలాట ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. ఈ ప్రాచీన కళ అంతరించిపోకుండా పలువురికి నేర్పిస్తూ, ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. 2010లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు.

విశాల ఫెర్రర్



ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్‌గా గ్రామీణ పేద మహిళల సాధికారతకు కృషిచేస్తున్నారు. బాల్య వివాహాలు, గృహ హింస నివారణకు సామాజిక బృందాలు ఏర్పాటు చేశారు. గృహహింస, అక్రమ రవాణా బాధితులకు ఆసరా నిమిత్తం కౌన్సెలింగ్, ఆశ్రయ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

డాక్టర్ ప్రసాద్ కైపా



అనంతపురంలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన ప్రసాద్ కైపా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు. పలు దేశాల్లోని కంపెనీల సీఈఓలు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు సైతం శిక్షణ ఇచ్చారు. కాలిఫోర్నియాలోని కైపా గ్రూప్స్ సీఈఓగానూ వ్యవహరిస్తున్నారు. హైదరాబాదులోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. భౌతికశాస్త్రం, కంప్యూటర్ రంగంలోనూ ప్రతిభావంతులు.

డాక్టర్ ఆర్ఎస్ మూర్తి




గుత్తి పట్టణానికి చెందిన బ్రిగేడియర్ డాక్టర్ ఆర్ఎస్ మూర్తి భారత సైన్యంలో విలువైన సేవలందించారు. 1969లో సైన్యంలోని మెడికల్ కార్ప్స్‌లో చేరిన ఈయన అనేక క్లిష్ట సమయాల్లో కీలకంగా వ్యవహరించారు. బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో గాయపడిన సుమారు పదకొండు వందలమంది సైనికులకు చికిత్స చేశారు. పూణెలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ రేడియాలజీ విభాగం హెచ్ఓడీగానూ పనిచేశారు.

ఆచార్య జింకా రంగ జనార్దన



తాడిపత్రికి చెందిన ఆచార్య జింకా రంగ జనార్దన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (అనంతపురం) వైస్ చాన్స్‌లర్‌గా పనిచేస్తున్నారు. ఇంతకుముందు అనంతపురం, హైదరాబాదు, కాకినాడ జేఎన్‌టీయూల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. 2016–21 మధ్య ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగానూ ఉన్నారు. అనంతపురం జేఎన్‌టీయూలో చదివి, అక్కడే వీసీగా నియమితులు కావడం విశేషం.

బండి నారాయణస్వామి



అనంతపురం పాతూరుకు చెందిన బండి నారాయణస్వామి ప్రముఖ రచయిత. ఎన్నో కథలు, నవలలు రాశారు. శూద్రపాదం, వీరగల్లు, రంకే, చమ్మీదండ కథా సంపుటాలు పాఠకాదరణ పొందాయి. శప్త భూమి నవలకు 2019లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. దళిత, బహుజన పక్షపాతైన బండి నారాయణస్వామి అభ్యుదయ రచనలతో సమాజాన్ని మేల్కొల్పుతున్నారు.

వాణి కోలా



పెనుకొండకు చెందిన ఈమె ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్టు. బెంగళూరు కేంద్రంగా 'కలారి క్యాపిటల్' సంస్థ స్థాపించి ఈ–కామర్స్, మొబైల్ సర్వీసులు, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన పలు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. ఫోర్బ్స్–2014 జాబితాలోనూ చోటు సంపాదించారు. సుదూర మార్కెట్‌ను అంచనా వేయగల పారిశ్రామిక దార్శనికురాలిగా గుర్తింపు పొందారు.

జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్



గుత్తి పట్టణానికి చెందిన జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్నారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగానూ వ్యవహరించారు. నేరసంబంధ న్యాయశాస్త్రంలో, రాజ్యాంగ సంబంధ అంశాల్లో విశేష అనుభవం గల వారు.

డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి



ప్రముఖ గుండె వైద్య నిపుణులు. కర్నూలు మెడికల్ కాలేజీలో కార్డియోథొరాసిక్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. వందలాది మంది పేదలకు గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. కోవిడ్ సమయంలో మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈయన స్వగ్రామం తాడిపత్రి.

మఠం వెంకటరావు



బ్యాంకింగ్ రంగంలో అంచెలంచెలుగా ఎదిగారు. అలహాబాద్ బ్యాంకులో అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్‌గా 1988లో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ఈయన ప్రస్తుతం సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా వ్యవహరిస్తున్నారు.గుత్తి స్వగ్రామం.

జెడే రాధిక



పెద్దపప్పూరు మండలం సోమనపల్లికి చెందిన రాధిక ప్రముఖ క్రీడాకారిణి. సాఫ్ట్‌బాల్‌లో ఇప్పటి వరకు 30కి పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొని సత్తా చాటింది.

మరికొందరు 'ఆణిముత్యాలు'

- కాలే హరిలాల్ నాయక్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి, నాగినాయనిచెరువు తండా, సోమందేపల్లి మండలం
- జీఆర్ రాధిక, ఐపీఎస్ అధికారిణి (ఎస్పీ, శ్రీకాకుళం), అనంతపురం
- డాక్టర్ శ్రీకాంతం నాగేంద్ర శాస్త్రి, ప్రముఖ సంగీత విద్వాంసులు, చింతలపల్లి, హిందూపురం మండలం
- రాహుల్ సాంకృత్యాయన్, సినీడైరెక్టర్, గుంతకల్లు
- నల్లపాటి రామకృష్ణ, ఆదరణ గ్రూప్ చైర్మన్, రంగాపురం, నార్పల మండలం
- ప్రియాంక సహజానంద, ఫ్యాషన్ డిజైనర్, అనంతపురం
- కళాసాగర్ విజయ్‌కుమార్, నృత్యదర్శకులు, జొన్నలకొత్తపల్లి, ముదిగుబ్బ మండలం
- జె.నాగరాజు, ప్రముఖ చేనేత డిజైనర్, ధర్మవరం
- రాళ్లపల్లి అనంతయ్య, సిప్లాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, కరుట్లపల్లి, కూడేరు మండలం

స్ఫూర్తి నింపే మహత్తర కార్యక్రమం



మన జిల్లాలో పుట్టి పెరిగి అత్యంత ప్రతిభావంతులుగా ఎదిగిన వారు ఎందరో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అలాంటి వారిని గుర్తించి 'అనంత ఆణిముత్యాలు' బిరుదుతో సత్కరించే బహత్తర కార్యక్రమాన్ని కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నాం. భావితరాలకు స్ఫూర్తి నింపడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం.ఈ నెల 28న పురస్కారాల ప్రదానోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశాం.

–జి.ప్రతాపరెడ్డి, అధ్యక్షులు, సాహితీ గగన్‌మహల్ ట్రస్టు

న్యూస్‌రీల్

నేటి నుంచి దూరవిద్య పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ దూరవిద్య డిగ్రీ, పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. మొత్తం 528 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల, తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండ మహాత్మ డిగ్రీ కళాశాల, హిందూపురం ఎస్డీ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఫిబ్రవరి 2 వరకు దూరవిద్య పరీక్షలు జరుగుతాయన్నారు.

ఘనంగా 'కోటంక' తిరునాల



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి ఆదివారం తిరునాల ఘనంగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు, అలంకరణలు జరిగాయి. మాఘమాసం మొదటి రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, కార్యనిర్వహణాధికారి ప్రత్యేక ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు తాతిరెడ్డి అన్నదానం చేశారు.

సాక్షి స్పెల్‌బీకి విశేష స్పందన



సాక్షి స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SAKSHI SPELL Bee

అనంతపురం: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన 'సాక్షి స్పెల్‌బీ' పోటీలకు విశేష స్పందన లభించింది. స్పెల్‌బీ పోటీలకు మెయిన్ స్పాన్సర్‌గా డ్యూక్స్, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు కేటగిరీల వారీగా ప్రత్యక్ష పరీక్ష రాశారు. కేటగిరీ –1 (ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు)లో 12 మంది, కేటగిరీ–2 (మూడు, నాలుగు తరగతులు)లో 18 మంది, కేటగిరీ–3 (ఐదు, ఆరు, ఏడు తరగతులు)లో 22 మంది, కేటగిరీ–4 (ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులు)లో ఏడుగురు పరీక్షలు రాశారు. 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, హెచ్ఎం ఆయేషా పర్యవేక్షణలో విశేషానుభవం గల ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

పదాల కూర్పుపై పట్టు



సాక్షి స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనడంతో ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు పెరిగింది. ఎలాంటి పోటీల్లో అయినా పాల్గొనవచ్చనే ధైర్యం వచ్చింది. ఇలాంటి ప్లాట్‌ఫామ్‌ను ఇచ్చిన సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. గతంలో పదాల కూర్పులో కొంచెం తడబాటు ఉండేది. సాక్షి స్పెల్‌బీ పోటీల్లో పాల్గొని క్రిటికల్ థింకింగ్ మెరుగుపడేలా చేసింది. ఈ కార్యక్రమంతో ఎన్నో అంశాలు నేర్చుకోగలిగాను.

– మన్విక్ సాయిరెడ్డి, ఎడిఫై వరల్డ్ స్కూల్, కర్నూలు

మెలకువలు నేర్చుకున్నా



కఠినమైన పదాలను సులువుగా పూర్తిచేయడానికి మెలకువలు నేర్చుకున్నాను. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన సాక్షి యాజమాన్యానికి అభినందనలు. ఇలాంటి కార్యక్రమాల్లో తరచూ పాల్గొనేలా ప్రోత్సాహమిచ్చారు.

– ఆమోదిని, రిడ్జ్ స్కూల్, కర్నూలు

గ్రామర్‌పై స్పష్టత వచ్చింది



సాక్షి స్పెల్‌బీ కార్యక్రమంలో పాల్గొని ఇంగ్లిష్ గ్రామర్‌పై స్పష్టత వచ్చింది. వాక్య నిర్మాణంలో ఎలాంటి పదాలు వినియోగించాలి? వంటి అంశాలపై అవగాహన వచ్చింది. పద సంపద పెంపొందేలా స్పెల్‌బీ దోహదపడింది. ఇంగ్లిష్ బాషకు సంబంధించిన చాలా అంశాల్లో పూర్తిగా స్పష్టత వచ్చింది.

– అనిక్య సాదిక్, విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్, అనంతపురం

పద సంపద మెరుగు



స్పెల్‌బీ కార్యక్రమంలో పాల్గొంటే విద్యార్థుల్లో పద సంపద మెరుగవుతుంది. వర్డ్ పవర్‌తో పాటు పదాలు తప్పులు లేకుండా వినియోగించడం, వాక్యనిర్మాణంలో ఎలాంటి పదాలు ప్రయోగించాలనే అంశాలపై స్పష్టత వస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను పెంపొందిస్తాయి.

– రోజా హనీ, రవీంద్ర విద్యా మేధ స్కూల్, కర్నూలు

సజావుగా ప్రిలిమినరీ పరీక్ష

పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ (ప్రాథమిక) పరీక్ష సజావుగా జరిగింది. అనంతపురం రీజియన్‌లో 34, గుత్తి రీజియన్‌లో 13 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి దరఖాస్తు చేసుకున్న 24,055 మంది అభ్యర్థుల్లో 22,808 మంది పరీక్షలు రాశారు. ఎస్పీ ఫక్కీరప్ప ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రానికి కిలోమీటర్ పరిధిలోని జిరాక్స్ సెంటర్లు మూసివేశారు. జనం గుమికూడకుండా 144 సెక్షన్ అమలు చేశారు. అసౌకర్యాలు కలగకుండా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో పరీక్షలు పారదర్శకంగా, పకడ్బందీగా ముగిశాయి.

- అనంతపురం శ్రీకంఠం సర్కిల్



వైవీ శివారెడ్డి కళాశాలలో అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప



అనంతపురం ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల హడావుడి



గుత్తి గేట్స్ కాలేజీ వద్ద పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



అభ్యర్థి హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న కానిస్టేబుల్

రూ.20వేలు ప్రయాణికుడికి అప్పగింత

గుత్తి రూరల్: ప్రజారవాణా శాఖ ఉద్యోగులు నిజాయితీ చాటుకున్నారు. ప్రయాణికుడు బస్సులో పోగొట్టుకున్న రూ.20 వేలను జాగ్రత్తగా తిరిగి అందజేశారు. వివరాలు.. ఆదివారం ఉదయం కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం గుత్తి డిపో నుంచి పామిడికి ఆర్టీసీ బస్సు బయలుదేరింది. పామిడి బస్టాండ్‌లో ప్రయాణికులను దింపిన అనంతరం కండక్టర్ నారాయణ బస్సు ఎక్కే సమయంలో కాలికి తగిలిన పర్సును తీసుకుని పరిశీలించాడు. అందులో రూ.20,400 నగదు ఉన్నట్లు గుర్తించి, బస్సు గుత్తి డిపోకు చేరుకున్న అనంతరం విషయాన్ని ఎస్టీఐ వరప్రసాద్‌కు తెలిపి పర్స్ అప్పగించాడు. ఇంతలో పర్సు పోగొట్టుకున్న పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన గంగాధరరెడ్డి పామిడి నుంచి గుత్తి బస్టాండ్ కంట్రోలర్‌కు ఫోన్ చేసి విషయాన్ని తెలిపాడు. దీంతో గంగాధరరెడ్డిని గుత్తికి పిలిపించుకుని తగిన ఆధారాలు పరిశీలించిన అనంతరం పర్సును అందజేశారు. కార్యక్రమంలో గుత్తి డిపో మేనేజర్ నారాయణస్వామి, ఎస్టీఐ వరప్రసాత్, కానిస్టేబుల్ వెంకటస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్రమట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీలు సీజ్

అనంతపురం సెంట్రల్/పెద్దవడుగూరు: గుత్తి రేంజ్ పరిధిలోని రాయలచెరువు, పెద్దవడుగూరు మండలం గోపురాజులపల్లి అటవీ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మట్టి తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీలను, మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితులపై అటవీ రక్షణ చట్టం కింద కేసులు నమోదు చేశారు. దాడుల్లో డీఎఫ్ఓ స్క్వాడ్ ఆశాకిరణ్ నేతృత్వంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓ కరీముల్లా, ఎఫ్‌బీఓ మాధవి పాల్గొన్నారు.

రేపు కదిరిలో జాబ్‌మేళా

కదిరి అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పది గంటలకు కదిరిలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హిందూపురం, అనంతపురంలో ఉన్న కేఐఎంఎల్, అపోలో ఫార్మసీ కంపెనీల్లో మొత్తం 160 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91822 88465, 94909 78868 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయ అటెండర్‌పై కేసు నమోదు

గుంతకల్లు రూరల్: ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ మహిళను మోసగించిన అంశానికి సంబంధించి గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయ అటెండర్ తిప్పేస్వామిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... గుంతకల్లులోని సంజీవనగర్ నివాసి లోకేశ్వరికి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అటెండర్ పోస్టు ఇప్పిస్తానంటూ తిప్పేస్వామి రూ. లక్షలు తీసుకున్నాడు. అనంతరం ముఖం చాటేశాడు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన లోకేశ్వరి.. ఏడు రోజుల క్రితం బాధితురాలు తహసీల్దార్‌కు, కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారణ అనంతరం ఆదివారం తిప్పేస్వామిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కసాపురం ఎస్ఐ గోపాలుడు తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- ఈ నెల 29 నుంచి బుక్కరాయసముద్రం కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు
- ఫిబ్రవరి 5న రథోత్సవం

బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన క్షేత్రాల్లో ఒక్కటైన కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలకు దేవరకొండ ముస్తాబవుతోంది. మాఘ మాసంలో ఇక్కడి శ్రీవారిని దర్శించుకుంటే కోర్కెలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో ఏటా మాఘమాసంలో బుక్కరాయసముద్రంలో కొండమీదరాయుడి తిరునాల అంగరంగా వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది పది రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

29న ప్రారంభం

కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. అనంతరం సాయంత్రం బుక్కరాయసముద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి స్వామి ఉత్సవ మూర్తులను కొండపైకి చేరుస్తారు.

- 30న ఉదయం 8 గంటలకు దేవరకొండపై ఉత్సవ మూర్తులకు పుణ్యాహవచనం, హోమాలు, గరుడ ఆహ్వాన పూజ, ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. అనంతరం సాయంత్రం 8 గంటలకు శ్రీవారి పుష్పపల్లకీ సేవ ఉంటుంది.
- 31న ఉదయం విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు సింహ వాహనంపై దేవేరులతో కలసి శ్రీవారు దర్శనమివ్వనున్నారు.
- ఫిబ్రవరి 1న రాత్రి శేష వాహనోత్సవం ఉంటుంది.
- 2వ తేదీ రాత్రి 8 గంటలకు హనుమద్వాహనంపై శ్రీవారు ఊరేగనున్నారు.
- 3న రాత్రి 8 గంటలకు గరుడ వాహన సేవ ఉంటుంది.
- 4న రాత్రి 8 గంటలకు శ్వేతగజ వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తారు.
- 5వ తేదీ వేకువ జాము 4 గంటలకు బుక్కరాయసముద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం ఉంటుంది. అనంతరం ఉదయం 11.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై దేవేరులతో కలసి శ్రీవారు ఊరేగనున్నారు. మధ్యాహ్నం వేలాది భక్తుల గోవింద నామస్మరణ మధ్య బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు.
- 6వ తేదీ రాత్రి 7 గంటలకు అశ్వ వాహన సేవ, 7వ తేదీ ఉదయం 7 గంటలకు తీర్థవాది వసంతోత్సవం ఉంటాయి. అదే రోజు రాత్రి 7 గంటలకు హంస వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిస్తారు.



దేవరకొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి మూలవిరాట్

బీసీలపై విషం చిమ్మితే సహించం

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం సప్తగిరి సర్కిల్: వాస్తవాలను వక్రీకరిస్తూ బీసీలపై విషమం చిమ్మితే సహించబోమని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ హెచ్చరించారు. ఈనాడు అధినేత రామోజీరావు కళ్లుండి చూడలేని కబోదిగా మారాడని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీకి బ్యాక్‌బోన్‌గా ఉన్న బీసీలపై చంద్రబాబు, రామోజీరావు విషం వెళ్లగక్కుతున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీల అభ్యున్నతిని చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. తాజాగా 56 బీసీ కులాల కార్పొరేషన్ల పాలక వర్గాల పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడగించి 750 మంది బడుగు, బలహీన వర్గాల వారికి రాజ్యాధికారాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించారన్నారు. దీనిని ఓర్వలేక చంద్రబాబు, రామోజీరావు శివాలెత్తి బీసీ సామాజిక వర్గ నాయకులపై చేస్తున్న విష ప్రచారం సాగిస్తున్నారన్నారు. కార్పొరేషన్ పదవులు శుద్ధదండగ అంటూ శునక విన్యాసం చేస్తున్న రామోజీరావును చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. బీసీ వర్గానికి చంద్రబాబు చేసిన ద్రోహాన్ని ఏనాడూ తన పత్రికలో రామోజీరావు ప్రస్తావించలేదన్నారు. చంద్రబాబు హయాంలో బీసీలకు ఏటా రూ. 10 వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు ఖర్చు చేస్తామని హామీనిచ్చి, కేవలం రూ.14.246 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మోసం చేస్తే ఈనాడులో చిన్న వార్త కూడా ప్రచురించలేదని గుర్తు చేశారు. బీసీల తోకలు కత్తిరిస్తామని చంద్రబాబు బహిరంగంగా దూషిస్తే బాబూ నీది నోరా.... తాటిమట్టా అని ఏ రోజైనా ప్రశ్నించావా అని నిలదీశారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత బీసీల కలను సాకారం చేస్తూ కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయాల్లో 83 శాతం ఉద్యోగాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకే అందాయన్నారు. తిరుమలలో 'సన్నిధి గొల్ల' సంప్రదాయాన్ని టీడీపీ జీతానికి పనిచేసే ఉద్యోగంగా మార్చి యాదవుల్ని అవమానిస్తే.. సీఎం వైఎస్ జగన్ దానిని గౌరవప్రదమైన సంప్రదాయంగా పునరుద్ధరించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా బీసీలపై బురద చల్లడం మానకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పేదల వద్దకే కార్పొరేట్ స్థాయి వైద్యం

- విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలు
- అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ అత్యాధునిక వైద్య సేవలు
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న విప్ కాపు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రాయదుర్గం: విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... తాజాగా అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటుతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను పేదల ముంగిటకే చేర్చారని విప్ కాపు రామచంద్రారెడ్డి కొనియాడారు. రాయదుర్గంలోని భంభంస్వామి లే ఔట్‌లో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీనివాస యాదవ్ (మున్సిపల్ వైస్ చైర్మన్) అధ్యక్షతన జరిగిన సమావేశంలో విప్ మాట్లాడుతూ.. రాయదుర్గంలో 30 పడకలున్న సీహెచ్‌సీని 100 పడకలకు విస్తరించినట్లు గుర్తు చేశారు. మరో ఆరు నెలల్లో కార్పొరేట్‌కు దీటుగా అత్యాధునిక సౌకర్యాలతో ఆస్పత్రిని నూతన భవనంలో మార్చి రాయదుర్గం ప్రజలకే అకింతం చేస్తామన్నారు. కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి ఒక్క మహిళా వైద్యురాలిని కూడా నియమించలేకపోయాడన్నారు. ఉత్తుత్తి పేపర్లు చూపి ప్రజలను కాలవ చేస్తూ వచ్చాడన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. రాయదుర్గంలో మరో రెండు ప్రైవరీ హెల్త్, గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి రానున్నాయన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొనియాడారు. మహిళలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోరే సీఎం జగనన్న పాలనను మరో 30 ఏళ్ల పాటు ఉండాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి మాట్లాడుతూ.. దేశం గర్వించేలా ఏపీలో సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి మాట్లాడుతూ.. అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజ్ నాయక్, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వలీబాషా, జెడ్పీటీసీ సభ్యుడు పి.మహేష్, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుజాత, వైద్యాధికారి రమేష్, కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణాలకు భూమిపూజ

రాయదుర్గం మండలం రాయంపల్లి నుంచి గుమ్మఘట్ట మండలం బేలోడు వరకూ 5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.1.38 లక్షలతో చేపట్టిన పనులకు ఆదివారం విప్ కాపు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, స్థానిక నాయకులు భూమి పూజ చేశారు. అలాగే పట్టణంలోని దండుమారెమ్మ, కౌన్సిలర్ గౌని లావణ్య వార్డులో రూ.21 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

'మేరా భారత్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

అనంతపురం కల్చరల్: తరిమెల అమరనాథరెడ్డి రచించిన 12వ పుస్తకం 'మేరా భారత్ మహాన్' ఆవిష్కరణ సభ ఆదివారం అనంతపురంలోని ఎన్‌జీఓ హోంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ... నాలుగు వందల సంవత్సరాల క్రితం వేమన తన పద్యాలతో సమాజంలో ఉండే మూఢనమ్మకాలను ప్రశ్నించిన తరహాలోనే తన రచనల్లో తరిమెల అమరనాథరెడ్డి నిలదీశారన్నారు. శ్రమజీవుల కష్టాలు, తనకు ఎదురైన సంఘటనలకు తరిమెల అమరనాథరెడ్డి అక్షరూపం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో విరసం రచయిత్రి శశికళ, ప్రముఖ రచయితలు బావకాటి రాఘవేంద్ర, వేలూరి జై చంద్ర, మానవతా కో కన్వీనర్ సలీం మాలిక్, మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

యాడికి: అరటి తోటను ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. యాడికి మండలం చందన గ్రామంలో రైతు వలిపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి సాగుచేసిన అరటి తోటను శనివారం రాత్రి ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. ఈ విషయంగా బాధిత రైతు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు తన సోదరుడు శ్రీకాంత్‌రెడ్డి కుమారులు రవికుమార్‌రెడ్డి, మనోష్‌కుమార్‌రెడ్డినే కారణమని పేర్కొన్నాడు. అడ్డుకోబోయిన తనపై దాడికి ప్రయత్నించారని వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రవికుమార్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కార్యాలయ పునాదుల ధ్వంసం

తాడిపత్రి అర్బన్: స్థానిక వెటర్నరీ ఆస్పత్రి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో దళితులు చేపట్టిన ఎమ్మార్పీఎస్ కార్యాలయ నిర్మాణపనులను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి అనుచరులు వెన్నపూసలపల్లి మల్లికార్జునరెడ్డి, సి.హరినాథరెడ్డి అడ్డుకున్నారు. డోజర్ సాయంతో కట్టడాలను కూలదోశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బాల చంద్రాయుడు, పెద్దిరాజును కులం పేరుతో దూషిస్తూ దాడికి ప్రయత్నించారు. ఘటనపై పోలీసులకు నాయకులు ఫిర్యాదు చేశారు.

ఆర్‌బీకే వేదికగా వ్యాక్సినేషన్లు పూర్తి

- దేశీయ పశుజాతి అభివృద్ధిలో భాగంగా వ్యాక్సినేషన్
- పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం



అనంతపురం అగ్రికల్చర్: పశుసంపద, జీవ సంపద పరిరక్షణకు ఆర్‌బీకేల వేదికగా చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉచితంగా చేపట్టిన వ్యాక్సినేషన్ ప్రక్రియ నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2.16 లక్షల పశువులు, 1.90 లక్షల గేదెలు ఉండగా, అత్యధికంగా 22.94 లక్షల గొర్రెలు, 4.12 లక్షల మేకలు, 5.27 లక్షల ఫౌల్ట్రీ ఉన్నాయని వివరించారు. ఈ ఏడాది కలవరపెట్టిన ముద్దచర్మవ్యాధి (లంపీ స్కిన్ డిసీజెస్) నివారణకు 90 శాతం పశుసంపదకు 1,68,816 డోసుల గోట్‌ఫాక్స్ వ్యాక్సిన్‌ను సకాలంలో అందజేయడంతో వ్యాధి తీవ్రతను పూర్తిగా అరికట్టినట్టైందన్నారు. సెంట్రలీ స్పాన్సర్డ్ స్కీమ్ కింద ఈ ఏడాది 3.82 లక్షల పశుసంపదకు గాలికుంటు వ్యాధి టీకాలు ఉచితంగా వేశామన్నారు. వీటిని ఇన్ఫర్మేషన్ నెట్ వర్క్ ఫర్ అనిమల్ ప్రొడక్టివిటీ అండ్ హెల్త్ (ఇనాఫ్) కింద ఆన్‌లైన్ చేసినట్లు పేర్కొన్నారు. నేషనల్ కంట్రోల్ ప్రోగ్రాం కింద పారుడురోగం నివారణకు 2,74,295 పీపీఆర్ టీకాలు ఉచితంగా వేశామన్నారు. అలాగే బ్రూసెల్లా కంట్రోల్ ప్రోగ్రాం (బీసీపీ) కింద నాలుగు నుంచి 8 నెలల వయస్సున్న దూడలకు 31,370 డోసుల బ్రూసెల్లోసీస్ టీకాలు ఉచితంగా వేసి 'ఇనాఫ్' పోర్టల్‌లో ఆన్‌లైన్ చేశామన్నారు. జీవాలకు నట్టల మందు కింద డీవార్మింగ్ 100 శాతం పూర్తయిందన్నారు. గడ్డి కొరత నివారణకు 60 శాతం సబ్సిడీతో కిలో రూ.6.50 ప్రకారం టీఎంఆర్ (దాణామృతం) గడ్డి 750 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామన్నారు. అలాగే 40 శాతం రాయితీ పోనూ రైతు వాటా కింద రూ.20,382 చెల్లించిన లబ్ధిదారులకు ఇప్పటి వరకూ 2 హెచ్‌పీ, మూడు బ్లేడులు కలిగిన 50 చాఫ్‌కట్టర్స్ (గడ్డికత్తిరించే యంత్రాలు) అందజేశామన్నారు. అలాగే రాయితీ పోనూ కిలో రూ.23 ప్రకారం 87 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు (ఫాడర్‌సీడ్) పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆర్‌కేవీవై కింద ఆకుతోటపల్లి, కరకముక్కల గ్రామాల్లో కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేశామన్నారు. దేశీయ పశుసంతతి అభివృద్ధి లక్ష్యంగా రోటరీపురం, ఆవులదట్ల, ముద్దినాయనపల్లిలో పశుక్షేత్రాలు ఉన్నాయన్నారు. అలాగే 90 శాతం మగదూడలు జన్మించేలా రాష్ట్రీయ గోకుల్‌మిషన్ కింద సార్టెడ్ సెమన్ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ గర్భోత్పత్తి కింద రెండు స్ట్రాల డోసు ఖరీదు రూ.1,350 కాగా దీనిపై రూ.850 సబ్సిడీ వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. రైతులు తమ వాటా కింద రెండు స్ట్రాలకు రూ.500 చెల్లించి తమ పశువులు, గేదెలకు కృత్రిమ గర్భోత్పత్తి చేసుకోవచ్చన్నారు. పశుశాఖ పథకాలు దాదాపుగా ఆర్‌బీకే వేదికగా కియోస్క్‌లో ఇండెంట్ ఆధారంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న ఎల్‌ఎం ఉమామోహన్‌రెడ్డి

తాడిమర్రి: గ్రంథాలయాలు విజ్ఞానం అందించే భాండాగారాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమె స్థానిక గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పురాణాలు, ఇతిహాసాలు, చరిత్ర, నవల, కథల పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంటాయన్నారు. వృద్ధులకు కాలక్షేపం, విద్యార్థులు, నిరుద్యోగులకు విజ్ఞానం లభిస్తుందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. పాఠకులకు తగినన్ని కుర్చీలు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని గ్రంథాలయాధికారి శీనా నాయక్‌ను ఆదేశించారు.

సాయం చేసే గుణం గొప్పది



టవర్‌క్లాక్ వద్ద విదేశీయుల పరుగు

- ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప



10కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: పేదలకు సాయం చేసే గుణం చాలా గొప్పదని, ఈ క్రమంలో ఆర్డీటీ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కొనియాడారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో నిర్వహించిన 10కే రన్‌ను కలెక్టరేట్ వద్ద ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, అల్ట్రా మారథాన్ రన్నర్ జువాన్ మ్యాన్యువల్‌తో కలసి ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి పాతూరు, శ్రీకంఠం సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్ట్స్ కళాశాల, టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, తెలుగుతల్లి కూడలి, మెడికల్ కళాశాల, విద్యుత్ నగర్ సర్కిల్, కదిరి రోడ్డు మీదుగా అనంత క్రీడా మైదానం వరకూ రన్ సాగింది. స్పెయిన్, జర్మనీతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 230 మంది రన్నర్లు పాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో ఎస్పీ మాట్లాడుతూ.. అన్ని రంగాల వారికి తోడ్పాటు నందిస్తూ సమానత్వం కోసం పాటు పడేలా యువతకు మార్గదర్శకంగా ఆర్డీటీ చేపట్టిన 10కే రన్ స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. మాంఛో ఫెర్రర్ మాట్లాడుతూ.. అల్ట్రా మారథాన్‌ను ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్నామని, అయితే తొలిసారి అనంత వేదికగా 10కే రన్‌ను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విభిన్న సంస్కృతులు, విభిన్న వ్యక్తులను ఏకం చేయడంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేసిందన్నారు. అనంతరం అనంత క్రీడాగ్రామంలో 5కే కమ్యూనిటీ రన్ నిర్వహించారు. ఇందులో ఈ నెల 24న నిర్వహించనున్న అల్ట్రామారథాన్ రన్‌లో పాల్గొనే రన్నర్లతో పాటు, ఆర్డీటీ ఎన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, డైరెక్టర్లు సాయికృష్ణ, దశరథ్, రాజశేఖరరెడ్డి, నిర్మల్ కుమార్, నాగప్ప, అభిషేక్ పాల్గొన్నారు.

అశ్వత్థం.. భక్తజన సందోహం

పెద్దపప్పూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన అశ్వత్థం క్షేత్రంలో మొదటి ఆదివారం తిరునాల అంగరంగ వైభవంగా జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. పెన్నానదిలో స్నానం చేసి నారాయణ స్వామి, భీమలింగేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పెద్దపప్పూరు, తాడిపత్రి రూరల్ ఎస్ఐలు ఖాజాహుస్సేన్, మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు పలువురు దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను ఆలయ పాలకమండలి చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.







ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శింగరబట్టు, గణపతి, నారాయణ స్వామి విగ్రహాలు, భీమలింగేశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు, పెన్నానదిలో స్నానం చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో తోపుదుర్తి ట్రస్ట్ తరపున సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ హేమలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలున్నవారికి పరీక్షలు చేసి, ఉచిత శస్త్రచికిత్సల అనంతరం కళ్లద్దాలు అందిస్తామన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు కంటిపరీక్షలు చేయించుకోవాలని, వెంట ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకురావాలన్నారు.

ఆపదలో క్షతగాత్రులను కాపాడుదాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ సురేష్‌నాయుడు

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆపదలో ఉన్న క్షతగాత్రులను మానవతాదృక్పథంలో కాపాడాలని ఆర్టీఓ సురేష్‌నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిమ్స్ సవేరా ఆస్పత్రుల్లో అవగాహన కల్పించారు. గుడ్‌సమర్టియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంవీఐలు సునీత, ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్పందన

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ పీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

అనంతపురం టవర్‌క్లాక్: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని సీఐడీ పీపీ పూజారి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక యాదవ భవన్‌లో సీఐడీ పీపీ ,ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్‌ను సన్మానించారు. సీఐడీ పీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలన్నారు. పార్టీలకతీతంగా యాదవులు అభివృద్ధిచెందాలన్నారు.కార్యక్రమంలో లక్ష్మీనరసప్ప, శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ యువతకు ఆదర్శం

అనంతపురం టవర్‌క్లాక్: నేతాజీ కలలు కన్న సమాజం యువత తోనే సాధ్యమని విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంతిని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ యువత సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు.

ముగిసిన విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో



బైక్, సైకిల్‌ను గెలుపొందిన విద్యార్థులతో విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో నిర్వాహకులు


అనంతపురం: ఇంటర్మీడియట్ కోర్సు పూర్తయిన తరువాత ఎలాంటి కోర్సుల్లో అడ్మిషన్ పొందాలనే అంశంపై నిర్వహించిన విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో ఆదివారం ముగిసింది. అనంతపురం గుత్తిరోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాలులో రెండు రోజుల నుంచి విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు బంపర్ బహుమతులు అందజేశారు. ఇందులో బైక్‌ను కణేకల్ మండలానికి చెందిన వనజాక్షి అనే విద్యార్థిని గెలుపొందారు. నలంద కళాశాలకు చెందిన విద్యార్థులు బృంద, నితిన్ సైకిళ్లు గెలుపొందారు.

రాప్తాడు రైల్వే గేటుకు మరమ్మతులు

రాప్తాడు: అనంతపురం - ధర్మవరం రైల్వే మార్గంలోని ప్రసన్నాయపల్లి - జంగాలపల్లి మార్గం మధ్యలో ఉన్న రాప్తాడు (గంగలకుంట) రైల్వే గేటు (124)ను రెండు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రాప్తాడు నుంచి ధర్మవరం పంగల్ రోడ్డు వెళ్లే దారిలో ఉన్న గంగలకుంట రైల్వే గేట్ వద్ద రైల్వే బ్రిడ్జి ఎల్‌సీ సిఫ్టింగ్ పని జరుగుతున్నందున ఈ నెల 23, 24న రైల్వే గేటు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ దారి వెంట వెళ్లే ప్రయాణికులు గమనించి గంగలకుంట మీదుగా అనంతపురానికి, అనంతపురం నుంచి రాప్తా డుకు వచ్చే ప్రయాణికులు గంగలకుంట, కందుకూరు, జంగాలపల్లి మీదుగా వెళ్లాలని సూచించారు.

ఏపీజేఏసీ కార్యదర్శి ఎంపికపై హర్షం

అనంతపురం క్రైం: ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యదర్శిగా పీఎస్ ఖాన్ ఎంపికపై ఏపీపీటీడీ (ఆర్టీసీ) జిల్లా ప్రచార కార్యదర్శి కే కల్లప్ప, నాయకులు కొండయ్య, నాగిరెడ్డి, తదితరులు ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.



● విహంగమా.. తెల్లబంగారమా!

మబ్బులు కమ్మిన ఆకాశం కింద దిగినట్లు అగుపించే ఈ అద్భుత చిత్రం అనంత సాగరం చెరువులోనిది. తూర్పున గిరులు.. ఉత్తరాన అనంత ట్యాంక్ బండ్‌లా అనిపించే ఆలయాల సమూహం. చెరువు గర్భంలో వరదలు ముంచెత్తి నీటమునిగిన పత్తి పంటలా కనిపించే బోసిన చెట్లు..వాటిపై పత్తికాయ పగిలి విచ్చుకున్న దూదిలా కనిపించే కొంగలు.. ఈ సుందర ప్రకృతి రమణీయ దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సాగరమదిన ఒదిగిన మకరము

చెరువులోన మొసలి.. చెరువు ఒడ్డున చెట్టు.. చెట్టుకొమ్మన కోతి ..ఇలా.. కోతి నీతి కథ చిన్నప్పుడు చదువుకున్నాం.. చిన్నపిల్లలకు చెప్పకుంటున్నాం..చెరువు గట్టుపై నుంచి చూస్తే నీటిలో మొసలిలా చెట్లు పొదిగినట్లుండగా.. వాటిపైన పిట్టలు ఒదిగి ఉన్నట్లూ కనిపిస్తుంది. చెరువు..చెట్లు..పిట్టలు.. కలగలసి సూర్యోదయమైనా, సూర్యాస్త మయమైనా.. ఏ వేళయినా అనంత సాగర మదిన ఒదిగిన మకరములా కనిపించే ఈ దృశ్యం విశేషంగా ఆకట్టుకుంటోంది.

నేనింతే...పన్ను కట్టనంతే

- ఇదీ టీడీపీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్, రాచానపల్లి మాజీ సర్పంచ్ నిర్వాకం
- మూడేళ్లుగా పంచాయతీకి ఇంటిపన్ను ఎగవేత
- నోటీసులు తీసుకోకుండా వెనక్కు పంపుతున్న వైనం



సిండికేట్‌నగర్‌లోని మాజీ సర్పంచ్‌కు చెందిన భవనం

రాప్తాడురూరల్: నాయకుడు ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలి. ప్రతిపనిలో ఆదర్శంగా నిలిచిన వాడే నాయకుడు. అయితే టీడీపీ అనంతపురం మండల కన్వీనర్, మాజీ సర్పంచు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీకి చెల్లించాల్సిన పన్ను ఎగ్గొడుతూ పేద ప్రజల హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తానంటూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని రాచానపల్లి పంచాయతీ ప్రజలు మండిపడుతున్నారు. అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌కు చెందిన జింకా సూర్యనారాయణ 2014 నుంచి 2018 వరకు రాచానపల్లి సర్పంచ్‌గా పని చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అనంతపురం మండల కన్వీనర్‌గా ఉన్నారు. ఈయనకు సిండికేట్‌నగర్‌లో నాలుగు దుకాణ గదులు, రెండు ఇళ్లు ఉన్నాయి. వీటికి సంబంధించి 2017 నుంచి ఇంటిపన్ను చెల్లించలేదు. 2022 నాటికి రూ. 18,650 బకాయి ఉంది. ప్రస్తుత సంవత్సరానికి రూ. 6,459 చెల్లించాల్సి ఉంది. అంటే మొత్తం రూ. 25,109 పంచాయతీకి చెల్లించాల్సి ఉంది.

ఆయనకే బాధ్యత లేకపోతే ఎలా?

సర్పంచ్‌గా పని చేసిన వ్యక్తికే పన్ను చెల్లించడంలో బాధ్యత లేకపోతే ఎలా? ఎన్నిమార్లు నోటీసులు ఇచ్చినా జింకా సూర్యనారాయణ స్పందించడం లేదు. చివరకు కోర్టుద్వారా నోటీసులు పంపినా తీసుకోకుండా వెనక్కు పంపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపడతాం.

– రామకృష్ణ పంచాయతీ కార్యదర్శి

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం

– సీనియర్ నాయకుడు తోపుదుర్తి చందు



రామగిరిలో ముత్యాలప్ప కుటుంబాన్ని పరామర్శిస్తున్న తోపుదుర్తి చందు

రామగిరి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మాదాపురం, నసనకోట, రామగిరి గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పరిటాల కుటుంబం మంత్రులు, ఎంఎల్‌ఎలుగా కొనసాగినా (పెనుకొండ, రాప్తాడు) ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. పేదలను పీడించి, డబ్బు దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, జిల్లాలో పేరుగాంచిన ముత్యాలమ్మ ఆలయం సొమ్ము కూడా వదల్లేదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని వాటిని కూడా నెరవేర్చారన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో పేరూరు డ్యాంకు నీరు ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవా నీటితో నింపడంతో పాటు, ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు సహకార డెయిరీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రామగిరి బంగారు గనులు కూడా తెరిపిస్తున్నట్లు తెలిపారు. రామగిరిలో తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన హరిజన ముత్యాలప్ప కుటుంబాన్ని పరామర్శించి, ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, సర్పంచ్ మీనుగనాగరాజు, నాయకులు నరసింహారెడ్డి, కురుబ ముత్యాలప్ప, రామాంజనేయులు, బోయ నాగేంద్ర, వెంకటేశులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రలేఖన పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు స్పందన లభించింది. స్థానిక రోటరీ పాఠశాల ప్రాంగణంలోని ఇంటాక్ కార్యాలయంలో 7,8,9 తరగతుల విద్యార్థినీ విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపారు. 'ఖానా ఖజానా' అన్న అంశం పై చిత్రలేఖనం , వ్యాస రచన పోటీల్లో విద్యార్థు తమ ప్రతిభను కనపర్చి అధికారులను మెప్పించారు. కార్యక్రమానికి ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, ఇంటాక్ సభ్యులు, పూర్వపు కన్వీనర్ ఏజీ వేణుగోపాల్ గత ఇరవై ఏళ్ల సేవను ప్రశంశించారు. ఇంటాక్ కన్వీనర్ ఆర్.రామకుమార్ , యువ కవి అశ్వర్థరెడ్డి తదితరులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. కార్యక్రమమంలో ఇంటాక్ సంస్థ ప్రతినిధులు బీజే గుప్తా , కేవీ రమణ, కంబదూర్ నబీరసూల్ , రవీంద్రారెడ్డి, కృష్ణమూర్తి , యాడికి సూర్యనారాయణ , జూటూరు షరీఫ్‌బాషా , గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న

రాప్తాడు: అన్ని రంగాల్లో వెనుక బడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకూ ఐకమత్యంగా పోరాడదామని రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దేవేంద్రప్ప పిలుపునిచ్చారు. రాప్తాడులోని ప్రాథమిక పాఠశాలలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్‌తో రజక హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ముందుగా బస్టాండు నుంచి ప్రాథమిక పాఠశాల వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. అనంతరం మీసాల రంగన్న, దేవేంద్రప్ప మాట్లాడుతూ రజకులు అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. సమాజానికి నాగరికతను నేర్పిన రజకుల జీవితాలు నేటికీ దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు అని మండిపడ్డారు. రజకుల మనుగడ కొనసాగాలన్నా, తమ జీవితాల్లో వెలుగులు నింపాలన్నా ఎస్సీ జాబితాలో చేర్చడమే మార్గమన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు తన పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో రజక జనసేన సంఘం రాష్ట్ర నాయకులు పెద్దన్న, మాజీ రజక ఫెడరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, కమ్మన్న, లింగమయ్య, చంద్రశేఖర్, హనుమన్న, పరమేష్, కృష్ణమూర్తి, నియోజకవర్గంలోని రజక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథుల ఇన్‌చార్జ్‌ల నియామకం

రాప్తాడురూరల్: జగనన్న కన్వీనర్లు, గృహ సారథుల (జేసీఎస్) అనంతపురం రూరల్ మండలం ఇన్‌చార్జ్‌లుగా పాపంపేటకు చెందిన మఠం శ్యాంసుందర్‌శాస్త్రి, కృష్ణంరెడ్డిపల్లికి చెందిన పెరవలి జయచంద్రారెడ్డిని నియమించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ మండలం-1కు మఠం శ్యాంసుందర్, అనంతపురం రూరల్ మండలం-2కు పెరవలి జయచంద్రారెడ్డిని నియమించారు. సచివాయాల కన్వీనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. శ్యాంసుందర్, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామన్నారు. నిత్యం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మేకల నాగరాజు(35) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతుండేవాడు. తనకున్న రెండెరాల భూమిలో వేరుశనగ పంట సాగు చేసేవాడు. ఇతనికి భార్య సరస్వతి ఉంది. కుటుంబ పోషణతోపాటు పంట సాగు కోసం అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మధనపడుతుండేవాడు. ఈక్రమంలో తీవ్రమనస్తాపానికి గురై శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుంభమేళా వాల్ పోస్టర్ల విడుదల

వజ్రకరూరు: మహారాష్ట్రలోని బెలగావ్ జిల్లా జామ్‌నేర్ తాలుకా గోద్రితండాలో ఈనెల 25 నుంచి నిర్వహించే అఖిల భారత బంజారా కుంభమేళా వాల్ పోస్టర్లను బంజారా సంఘ నేతలు విడుదల చేశారు. మండలంలోని రూపానాయక్ తండాలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బంజారా సంఘం జాతీయ నాయకుడు ఎస్‌కే కేశవ నాయక్ , నంగరేర్ నాయక్ మాట్లాడారు. మహారాష్ట్రలోని బెలగావ్ జిల్లా గొద్రితండాలో ఐదు రోజులపాటు జరిగే అఖిల భారతీయ గోర్ బంజారాల కుంభమేళా కార్యక్రమానికి రూపానాయక్‌తండావాసులకు ప్రత్యేక ఆహ్వానం వచ్చిందన్నారు. 25వ తేదీ ప్రత్యేక బస్సులో బయలుదేరి 26, 27 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే కుంభ మేళాలో పాల్గొంటామని వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి కల్యాణోత్సవం

కళ్యాణదుర్గం: పట్టణంలోని పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణానక్షత్రం సందర్భంగా శ్రీవారి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీత ధారణ, వరపూజ, వస్త్ర సమర్పణం, మహా సంకల్పం, కన్యాదానం, మాంగల్య పూజ, అక్షతరోపనం, మహా మంగళహారతి పూజలు చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం వినియోగం చేపట్టారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పంచామృతాభిషేకాలు



సహస్ర మోదుక మహాగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం, ఆకుపూజ, మహానైవేద్యం, పల్లకీసేవ నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామికి పార్వతిదేవికి పూజలు చేసి, మహా మంగళ హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాఘమాస పూజలు ప్రారంభం

పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి మాఘమాస పూజలు ప్రారంభమయ్యాయి. మొదటి ఆదివారం సందర్భంగా ఆలయంలో సకలకార్య సిద్ధికి మహా గణపతి ప్రీతికి సహస్ర మోదుక మహాగణపతి హోమం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు మంగళ స్నానాలు అనంతరం పంచామృతాభిషేకాలు చేశారు. ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, పల్లకీసేవ, మహామంగళహారతి, కుజదోష, కాలసర్పదోష నివారణకు సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. ఆలయంలోని మంజునాథస్వామికి, పార్వతి దేవికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. పూజలకు ఉమ్మడి అనంతపురం జిల్లావాసులేకాక కర్ణాటక నుంచి తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రతి శుక్ర, మంగళ, ఆదివారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

నీటి సమస్య పరిష్కారం



మల్లేశ్వర రోడ్డు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం క్రైం: నగరంలోని మల్లేశ్వర రోడ్డులోని 30 ఇళ్లకు నీటి సరఫరా జరిగేలా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. పైప్‌లైన్ సమస్యతో గత కొన్ని రోజులుగా నీటి సరఫరా ఆగిపోవడాన్ని తెలుసుకున్న డిప్యూటీ మేయర్ మల్లేశ్వర రోడ్డులో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. సంబంధిత నీటి సరఫరా విభాగం అధికారులతో మాట్లాడి, నీరు యథావిధిగా వచ్చేలా పైప్‌లైన్ మరమ్మతు పనులు చేయించారు.

మరమ్మతు పనులు పూర్తి : నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి మెయిన్ పంపింగ్ లైన్ మరమ్మతు పనులు శనివారం అర్ధరాత్రి పూర్తయ్యాయి. హంసపల్లి వద్ద పంపింగ్ లైన్‌కు లీకేజీ ఏర్పడిన విషయం విదితమే. దీంతో యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందని నగర పాలక సంస్థ నీటి సరఫరా విభాగం అధికారులు తెలియజేశారు.

సంత ద్వారా రూ.1.78 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,78,250 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పశువులకు వ్యాపిస్తున్న ముద్దచర్మవ్యాధి (లంపీ స్కిన్ డిసీసెస్) కారణగా కలెక్టర్ ఆదేశాల మేరకు గతేడాది సెప్టెంబర్ మూడో వారం నుంచి మార్కెట్ యార్డులో పశువుల సంత బంద్ చేశామన్నారు. కేవలం శనివారం మాత్రమే గొర్రెలు, మేకల క్రయ,విక్రయాలు జరుగుతున్నట్లు తెలిపారు.

ఏపీ రెడ్డి జన సంఘ్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఏపీ రెడ్డి జనసంఘ్ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఏపీ రెడ్డి జన సంఘ్ క్యాలెండర్, డైరీని స్థానిక ఏపీ రెడ్డి జన సంఘ్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. 2023 సంవత్సరానికి సంబంధించి డైరీని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి రొద్దం సురేష్‌రెడ్డి, ఈసీ మెంబర్లు బొమ్మలాటపల్లి సత్యనారాయణరెడ్డి, ఆప్లికల్ శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మి నారాయణరెడ్డి, సంజీవరెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

మేదర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

అనంతపురం టవర్‌క్లాక్: మేదర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని మేదర సంఘం అధ్యక్షుడు పోలేపల్లి నాగరాజు కోరారు. ఆదివారం స్థానిక మల్లాలమ్మ ఆలయంలో మేదర్ల చైతన్య సభ నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ మేదర్లు ఇతర రాష్ట్రాల్లో ఎస్టీ, ఎస్సీలుగా ఉన్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. మేదర్ల సమస్యలపై చర్చించారు. అనంతరం మల్లాలమ్మదేవి ఫొటోలు, చరిత్ర గలిగిన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, నాటమల్లప్ప, చంద్రశేఖర్, ఆదినారాయణ, సతీష్, వెంకటాచలపతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



ప్రమాదానికి గురైన కారు

కనగానపల్లి: ముక్తాపురం సమీపంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. అనంతపురం నగరానికి చెందిన విశ్రాంత ఎస్‌ఐ పూజారి జనార్ధన తన భార్య లీలావతితో కలసి ఆదివారం మధ్యాహ్నం కర్ణాటకలోని నాగులమడక నుంచి అనంతపురానికి కారులో బయల్దేరారు. జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న మరో వాహనం అడ్డు వచ్చింది. వాహనాన్ని తప్పించబోయి కారును పక్కకు తిప్పటంతో రహదారి పక్కనే ఉన్న దిమ్మెను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న జనార్ధన్‌తో పాటు అతని భార్య గాయపడ్డారు. స్థానికులు వెంటనే హైవే పెట్రోలింగ్ వాహనం ద్వారా క్షతగాత్రులను అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నేటి నుంచి ప్రతిష్టాపనోత్సవాలు

యాడికి: రాయలచెరువు గ్రామంలో కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ నేపథ్యంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచు తలారి అరుణ, వైస్ ఎంపీపీ హసీనాభేగం తెలిపారు. తొలిరోజు గణపతి పూజ, గంగపూజ, గోపూజ, 24న జపాలు, చండీ హోమం, దీక్షా హోమం, సాయంత్రం గ్రామోత్సవం, 25న ఉదయం 4 గంటల నుంచి యంత్ర, బింబ, ప్రాణ ప్రతిష్టాపన ఉంటుందన్నారు.

అపూర్వ సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

అనంతపురం:శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో 1999–2000 బ్యాచ్‌లో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు ప్రకాష్, సుబ్బరాయుడు, జహంగీర్ బాషా, సుశీలమ్మ, గంగాధరాచారి తదితరులను సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలు, అనుభూతులను ఒకరినొకరు పంచుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర ప్రసాద్, జేఎస్‌టీయూ అప్కోస్ ప్రెసిడెంట్ శిరీష్ రెడ్డి, మాధవి మొబైల్స్ అనిల్ కుమార్ చౌదరి, కియా మోటార్స్ సుధాకర్ రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ అకౌంటెంట్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.